క్లుప్తంగా

అరట్లకట్ట హైస్కూల్ హెచ్ఎంగా శ్రీనివాసకుమార్



కరప: మండలంలోని అరట్లకట్ట ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పి.శ్రీనివాసకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా అరట్లకట్ట హెచ్ఎంగా పనిచేస్తున్న డాక్టర్ పీవీ శివగిరి గెజిటెడ్ హెచ్ఎంగా పదోన్నతి లభించగా, శంఖవరం మండలం పాలమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో ఐ.పోలవరం మండలం కేశనకుర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎం శ్రీనివాసకుమార్ అరట్లకట్ట హైస్కూలుకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయుల సమన్వయంతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని హెచ్ఎం శ్రీనివాసకుమార్ తెలిపారు.

వేసవిలో వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



వృద్ధులకు పాదరక్షలు, విసనకర్రలు పంపిణీ చేస్తున్న వరలక్ష్మి

కాకినాడ రూరల్: చర్మ వ్యాధులు రాకుండా వేసవిలో వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని వైద్య నిపుణులు ఎం.వరలక్ష్మి అన్నారు. ఎండల తీవ్రత పెరగడంతో చెమట ఎక్కువగా పట్టి చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. స్థానిక రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద శుక్రవారం వృద్ధులకు పాదరక్షలు, విసనకర్రలు, మజ్జిగ ప్యాకెట్లను ఆమె పంపిణీ చేశారు. వేసవి ఎండలు పెరగడంతో వృద్ధులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, కొమ్మూరి శ్రీనివాసరావు, ఎస్ శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ సతీష్

కాకినాడ క్రైం: పాముకాటుతో తండ్రి చనిపోవడంతో చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఓ విద్యార్థినికి దాత ఆర్థిక సాయం అందించారు. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన సబ్బెళ్ల జానకి రామారెడ్డి ఆయన భార్య మధుబాల పుట్టిన రోజు సందర్భంగా పిఠాపురం మండలం ఇసుకపల్లి గ్రామానికి చెందిన నక్కా రమ్య అనే పదో తరగతి విద్యార్థినికి రూ.32,500 ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని శుక్రవారం శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ కాకినాడలోని గ్లాస్ హౌస్ సెంటర్‌లో ఉన్న శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్‌లో అందజేశారు.

ప్రణీతకు ప్రతిభ షైనింగ్ స్టార్ అవార్డు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతిభ షైనింగ్ స్టార్ అవార్డుకు స్థానిక రామారావుపేట నారాయణ పాఠశాల విద్యార్థిని ఏజీవీపీ ప్రణీత ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ షర్మిల శుక్రవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖ నుంచి ఎంపిక పత్రాలు అందాయన్నారు. జిల్లా కేంద్రంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగే కార్యక్రమంలో ప్రణీతకు రూ.20 వేల నగదు, సర్టిఫికెట్, మెడల్ అందిస్తారన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 596/600 మార్కులు సాధించి ప్రణీత ఈ అవార్డుకు ఎంపికైందని తెలిపారు.

చిట్టి పాదాలకు పెద్ద కష్టం

- బాలల భవితను నాశనం చేస్తున్న వంకర పాదాల సమస్య
- జీజీహెచ్‌లో క్లబ్ ఫుట్ సేవలు
- ఉచిత వైద్యం, సపోర్ట్ షూస్, ఇన్‌సోల్స్
- క్యూర్ ఇండియా, డీఐఈఎస్, జీజీహెచ్ సంయుక్త నిర్వహణ



క్లబ్‌ఫుట్ ఉన్న మూడు రోజుల బాలిక (చికిత్స ముందు, తర్వాత)



క్లబ్‌ఫుట్ చిన్నారికి అమర్చిన ఇన్‌సోల్స్

కాకినాడ క్రైం: వంకర పాదాలు చిన్నారుల భవితను చిదిమేస్తున్నాయి. సమస్యపై తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం పసివాళ్లకు శాపంగా మారుతోంది. ఈ దిశగా సంబంధిత విభాగాలు అవగాహన కల్పిస్తున్నా, అవి పూర్తి స్థాయి ప్రయోజనాన్ని అందించలేకపోతున్నాయి. క్షేత్రస్థాయికి చేరలేకపోతున్నాయి. వైద్య విభాగంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఈ సమస్యపై శిక్షణ ఉండడం లేదు. పుట్టిన వెంటనే, అదీ కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే శిశువులను పరిశీలించేందుకు ప్రత్యేక సిబ్బంది ఉంటున్నారు. వారు శిశువుల కాళ్లల్లో వంకర్లు గమనించి చికిత్స కోసం సిఫార్సు చేస్తుండగా, లేకపోతే లేదన్నట్టుగా ఉంది. జన్యు, ఇతర కారణాలతో సమస్య తీవ్రమవుతున్న తరుణంలో కాకినాడ జీజీహెచ్‌లో ఉచితంగా వంకర పాదాలు (క్లబ్‌ఫుట్ లేదా ఫ్లాట్‌ఫుట్)కి చికిత్స అందిస్తుండడం వరంగా మారింది.

కారణాలు ఇవీ..

జన్మతహ కొందరు పిల్లల్లో ఫ్లాట్‌ఫుట్ లేదా క్లబ్‌ఫుట్ ప్రాప్తిస్తుంది. ఇది అతి కొద్ది మందిలో జన్యుపరంగా వస్తుంది. పాదాల్లో వంపు లేకుండా పుట్టడం వల్ల ఇది సంభవిస్తుంది. కొందరు పిల్లల్లో వయసు పెరుగుతున్న కొద్దీ ఇది సాధారణం అవుతుంది. అరుదుగా కొందరిలో వయసు పెరిగినా వంపు ఏర్పడదు. పాదాల కండరాల బలహీనత వల్ల కూడా వంకర పాదాలు ఏర్పడతాయి. గాయాలకు చికిత్స అందించడంలో అశ్రద్ధ, ఎముకల సమస్యలు కూడా వంకర పాదాలకు దారితీస్తాయి. మూత్రపిండ సమస్యలు పలుమార్లు కారణమవుతాయి. గర్భధారణ సమయంలో బిడ్డ అధిక బరువు కారణంగా ఒత్తిడి పాదాలపై పడి వంకర పాదాలు సంభవిస్తాయి. నరాల సంబంధిత వ్యాధులు, తల్లికి మధుమేహం పిల్లల్లో వంకర పాదాలకు దారితీయవచ్చంటున్నారు.

సమస్యలివిగో..

వంకర పాదాల వల్ల జీవన నాణ్యత పూర్తిగా దెబ్బతింటుంది. శిశువు ఎదుగుతున్న కొద్దీ శరీర ఆకారం పూర్తిగా మారిపోతుంది. మడమ, పాదాలు, మోకాలు, నడుము నొప్పి ఉంటాయి. నడవడంలో అసౌకర్యం ఏర్పడుతుంది. త్వరగా అలసట వస్తుంది. చెప్పులు, బూట్లు, దుస్తులు ధరించడంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

కాకినాడ జీజీహెచ్‌లో క్యూర్ ఇండియా, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ), జీజీహెచ్ ఆర్థోపెడిక్స్ సంయుక్తాధ్వర్యంలో ఆర్థోపెడిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.అరుణ పర్యవేక్షణలో వంకర పాదాల బాలలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి గురు, శుక్రవారాల్లో ఈ చికిత్సలు కాకినాడ జీజీహెచ్‌లో జరుగుతాయి. దశలవారీగా బాధిత శిశువులకు చికిత్స అందిస్తారు. 21 రోజుల్లోపు చికిత్స అందిస్తే పూర్తి సాధారణ స్థితి ఉంటుంది. రెండేళ్ల లోపు అయితే నయం చేసేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది. ఈ చికిత్సను దశలవారీగా నిర్వహిస్తారు. వయసు తీవ్రత ఆధారంగా దశల వారీగా ట్రీట్మెంట్ ప్రొటోకాల్‌ని అవలంబిస్తారు. టేపింగ్, కౌన్సెలింగ్, క్యాస్టింగ్, టినాటమీ అనే ప్రక్రియల ద్వారా పలు దశల్లో చికిత్స అందిస్తారు. కోలుకోవడం కూడా దశలవారీగానే జరుగుతుంది. ఫిజియోథెరపిస్టు ఆర్ఎస్‌పీ వికాసిని ఈ క్లబ్ ఫుట్‌కు ప్రత్యేక ఫిజియో చికిత్స అందిస్తారు. మేనేజర్ బిందు ఆధ్వర్యంలో ఈ వైద్య ప్రక్రియలను చేపడుతున్నారు.



వంకర పాదాలున్న చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్న ఫిజియోథెరపిస్ట్ వికాసిని

క్యూర్ ఇండియా సహకారం

కాగా క్యూర్ ఇండియా సహకారంతో క్లబ్‌ఫుట్ బాధిత చిన్నారుల భవిత బంగారుమయం అవుతుంది. ఈ స్వచ్ఛంద సేవా సంస్థ బాధిత బాలలకు అందించే వైద్యం నుంచి పాదాలు సరిచేసేందుకు వినియోగించే పరికరాల వరకు ప్రతి ఖర్చునూ భరిస్తోంది. తన సేవాపథాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కాకినాడ జీజీహెచ్‌ను ఎంపిక చేసుకుంది. క్యూర్ ఇండియా జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కిరణ్ రాయ్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల సమన్వయంతో తల్లిదండ్రులకు ఈ సమస్యపై అవగాహన కల్పిస్తున్నారు.

పూర్తి స్థాయి చికిత్స



కాకినాడ జీజీహెచ్‌లో వంకర పాదాలకు పూర్తి స్థాయి చికిత్స అందిస్తున్నాం. చాలా మంది తల్లిదండ్రుల్లో అవగాహన కొరవడి పిల్లలకు వంకర పాదాలు ఉంటున్నా, వయసు పెరుగుతున్న కొద్దీ మామూలవుతాయని నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. అటువంటి వారు తక్షణమే మా సిబ్బందిని సంప్రదించాలి. కాకినాడ జీజీహెచ్‌లో డీఈఐసీ సెంటర్‌లో అన్ని వేళలా అందుబాటులో ఉంటారు. తమ క్లబ్‌ఫుట్ బాధిత చిన్నారికి చికిత్స అందించేందుకు డీఈఐసీ మేనేజర్ బిందును 73860 75778 సంప్రదించండి.

– డాక్టర్ అరుణ విష్ణుమొలకల, ప్రోగ్రాం ఆఫీసర్, ఆర్‌బీఎస్‌కే–ఎన్‌సీడీ, కాకినాడ

నూరు శాతం పరిష్కారం



వంకర పాదాలు చికిత్సతో నూరుశాతం నయం అవుతాయి. పుట్టిన 21 రోజుల్లోపు అయితే సాధారణ స్థితికి చేరడం సమస్యే కాదు. రెండేళ్లు దాటితే కొంత క్లిష్టతరం. తర్వాత సరిచేయగలిగినా చికిత్స ప్రక్రియలో ప్రతిబంధకాలు ఏర్పడవచ్చు. ఆర్చ్ సపోర్ట్ షూస్ లేదా ఇన్‌సోల్స్, ఫిజియోథెరపీ ద్వారా కండరాల బలాన్ని పెంచే వ్యాయామాలు, బరువు నియంత్రణ, ప్రత్యేక పరిస్థితుల్లో టేపింగ్, క్యాస్టింగ్ దాటి టినాటమీ నిర్వహించాల్సి ఉంటుంది. అధునాతన వైద్య ప్రక్రియల ద్వారా వంకర పాదాల సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించవచ్చు. తల్లిదండ్రుల నిర్లక్ష్యం చేస్తే మాత్రం బిడ్డ భవిష్యత్తును చిదిమేయడమే.

– డాక్టర్ ఎంపీఆర్ విఠల్, హెచ్‌ఓడీ, ఆర్థోపెడిక్స్

కవితల పోటీల్లో మార్నికి ప్రథమ బహుమతి

బోట్‌క్లబ్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జరిగిన కవితా పోటీల్లో కాకినాడకు చెందిన మార్నీ జానకిరామచౌదరి ప్రథమ స్థానం సాధించారు. రిటైర్డ్ వ్యవసాయ శాఖ డైరెక్టర్ కామిశెట్టి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో శుక్రవారం యానాంలో ఈ పోటీలు జరిగాయి. యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ చేతులమీదుగా బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా జానకీరామచౌదరిని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గనారా, సభ్యులు జ్యోసుల కృష్ణబాబు, పద్మజావాణి, సాయి సత్యనారాయణ, పలువురు కవులు అభినందించారు.

పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

బాలాజీచెరువు: ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి పుస్తక పఠనం ఉపకరిస్తుందని రిటైర్డ్ ఉపాధ్యాయుడు వై.సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, వాటిని ప్రతి ఒక్కరూ సందర్శించాలన్నారు. ఉద్యమ నాయకుల త్యాగాలు, పుస్తక పఠనం ఆవశ్యకతను గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి సావిత్రిప్రసాద్, రిసోర్స్‌పర్సన్ టి.జయరాం, పి.వీరబాబు పాల్గొన్నారు.


రెండో దశ వంటశాలలకు భూమిపూజ



శిలా ఫలకం ఆవిష్కరణలో కలెక్టర్ షణ్మోహన్, ఇతర ప్రతినిధులు

కాకినాడ రూరల్: అక్షయ పాత్ర ఫౌండేషన్ రెండో దశ కేంద్రీకృత వంటశాలలకు శుక్రవారం వాకలపూడి వరలక్ష్మినగర్‌లో కలెక్టర్ షణ్మోహన్, సంస్థ ప్రెసిడెంట్, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఇండియా సత్య గౌర చంద్రదాస, ఎస్‌జీసీ సీజీఎం ప్రభాల్ సేన్ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం సమర్థంగా అందించేందుకు ఓఎన్‌జీసీ సీఎస్సార్ నిధులు రూ.18.2 కోట్లతో రెండో దశ వంటశాల నిర్మాణం చేపడతారన్నారు. మూడు గంటల్లో 25 వేల మందికి భోజనాలు తయారు చేసేలా వంటశాల ఉంటుందన్నారు. వంటశాల నిర్మాణానికి భూమిపూజ, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సర్వీస్ మేనేజర్ రజిత్ మల్హోత్రా సంజయ్‌లాల్, ఢిల్లీ సీజీఎం పీవీవీ సత్యనారాయణ, సంస్థ ప్రాంతీయ అధ్యక్షుడు నిస్కించన భక్తదాస తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు



ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బక్రీద్ పండగ వారి జీవితాల్లో నూతన ఉత్తేజాన్ని నింపాలని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే ఈ బక్రీద్ పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలకు అన్నివిధాలా మంచి జరగాలని, అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

అపర్ణాదేవికి 'మామిడి' అలంకరణ



పిఠాపురం: జ్యేష్ఠ మాసం శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు మామిడిపండ్ల అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి ఏటా జ్యేష్ఠ మాసంలో మామిడి పండ్లతో అలంకరించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి చీడ

వైఎస్సార్ సీపీ మహిళా నేత జమ్మలమడక



జమ్మలమడక నాగమణి

కాకినాడ రూరల్: రాష్ట్రానికి కూటమి ప్రభుత్వ పాలనతో చీడ పట్టిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. ఏడాది పాలనలో ప్రజలకు ఏ లబ్ధి చేకూరలేదని శుక్రవారం ఆమె మీడియాకు తెలిపారు. సంక్రాంతిలో క్రాంతి, దీపావళిలో వెలుగులు లేవని, పండగ మాత్రం కూటమి నేతలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని అప్పులాంధ్రగా మార్చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

కన్నుల పండువగా భీమేశ్వరుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: నగరంలోని దేవాలయంవీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచలి కార్తీక్ ఆధ్వర్యంలో కల్యాణం ఆద్యంతం శాస్త్రోక్తంగా కొనసాగింది. స్వామివారికి ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తూరంగి గ్రామానికి చెందిన సాయిరమేష్ ఇటీవల ముమ్మిడివరంలో శుభకార్యానికి వెళ్లి గోదావరిలో మునిగి మరణించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో అతడి కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని సాయి రమేష్ తండ్రికి మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా శుక్రవారం అందజేశారు.

దేశీయ సంస్కృతిలో వృక్షాలకు ప్రాధాన్యం



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ ఉమర్ ఆలీషా

- పర్యావరణ పరిరక్షణకు అందరూ మూడు మొక్కలు నాటాలి
- సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా



మొక్కలు నాటే కార్యక్రమంలో డాక్టర్ ఉమర్ ఆలీషా, జడ్జి సుశీ, డాక్టర్ రమాదేవి

కాకినాడ రూరల్: భారతీయ సంస్కృతిలో వృక్షాలను పూజిస్తారని, ప్రతి ఒక్కరూ ఏటా మూడు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. వాకలపూడిలో శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆశ్రమ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం మెంబరు, జడ్జి చక్కా సుశీ, ఈషా వుమెన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి ప్రసంగించారు. డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ మట్టి కుండలలో నీరు తాగడమనే సనాతన భారతీయ సంస్కృతిని ఆచరించి ఆరోగ్యాన్ని పొందడంతో పాటు, క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం మొక్కలు పెంచడంపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన ర్యాలీని డాక్టర్ ఉమర్ ఆలీషా ప్రారంభించారు. వాకలపూడి నుంచి సర్పవరం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, సెంట్రల్ కమిటీ సభ్యుడు ఏవీవీ సత్యనారాయణ, స్థానిక కన్వీనరు మండా ఎల్లమంబ, కాకినాడ లక్ష్మి, చిర్ల వెంకటరెడ్డి, రెడ్డి సూర్య ప్రభావతి, దాట్ల శ్రీదేవి, మణి, నూక రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక



నక్కా నాగసత్య మల్లేశ్వరి



మేడిశెట్టి మాలశ్రీ



సిర్విశెట్టి వీరలక్ష్మి సాయిసృజన



పంతుల సాయిలక్ష్మి



సిద్ధాంతపు గీతామాధురి

కరప: మండలంలోని అరట్లకట్ట ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎన్ఎంఎం(నేషనల్ మీన్స్ కం మెరిట్) స్కాలర్‌షిప్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ స్కాలర్‌షిప్‌లో ఏడాదికి రూ.12 వేల వంతున ఐదేళ్లు ఇస్తారని హెచ్ఎం పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నక్కా నాగసత్య మల్లేశ్వరి, మేడిశెట్టి మాలశ్రీ, సిర్విశెట్టి వీరలక్ష్మి సాయిసృజన, పంతుల సాయిలక్ష్మి, సిద్ధాంతపు గీతామాధురి ఎంపికైనట్టు వివరించారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన మ్యాథ్స్ టీచర్ మాదిరెడ్డి శ్రీనివాస్‌ను సర్పంచ్ గోపిశెట్టి సత్యవేణి, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్ఎంలు అభినందించారు.

వేసవి సెగకు చిరుజల్లులతో సేద



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా కరప మెయిన్ రోడ్డు



సాయంత్రం కరపలో కురుస్తున్న వర్షం

కరప: అసలే రోహిణీ కార్తె ఎండలు. ఆపై భానుడి ప్రతాపంతో శుక్రవారం వేసవి సెగతో ప్రజలు విలవిల్లాడారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై.. కొన్నిచోట్ల చిరుజల్లులు పడడంతో జనం సేద తీరారు. వేసవి వడగాడ్పులు భరించలేక వృద్ధులు, మహిళలు అపసోపాలు పడ్డారు. ఈ వేసవిలో అల్పపీడన ప్రభావంతో అప్పుడప్పుడూ వర్షాలు పడినా, ఐదు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకోవడంతో పగలే చీకటిగా మారింది. వాహనచోదకులు లైట్లు వేసుకుని మరీ వాహనాలు నడిపారు. చల్లటిగాలులు వీయడంతో చిన్నారులు కేరింతలు కొట్టారు. కొద్దిసేపటికి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది, కొన్ని గ్రామాల్లో చిరుజల్లులు పడటంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. రుతుపవనాలు బలపడి వర్షాలు పడితే ఫర్వాలేదని, లేకపోతే కొద్ది రోజుల్లో కలిసే మృగశిర కార్తెలో వేసవితాపం తప్పదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలో అంధకారం

కరప: మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో పిడుగుల వర్షం పడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. సాయంత్రం ఐదు నుంచి రాత్రి 9 గంటలైనా కరెంట్ రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో నడకుదురు, వేములవాడ గ్రామాల్లో పిడుగులు పడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి.



కారుమబ్బులు.. ఈదురుగాలులు

గాలులు, వర్షాలకు పలు గ్రామాల్లో 18 చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కరప సబ్‌స్టేషన్‌లో ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాను నిలిపి వేసి, ఏఈ సానా ఈశ్వరప్రసాద్ సిబ్బందితో కలిసి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. మండల కేంద్రానికి రాత్రికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని, మిగిలిన గ్రామాలకు శనివారానికల్లా విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ తెలిపారు.

యోగాసనాలపై శిక్షణ



కరపలో యోగా శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కరప: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కరపలో యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. మండల స్థాయి అధికారులు, 23 పంచాయతీల సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు. యోగా గురువు పి.లోవరాజు, ఆయుష్ డాక్టర్ దివ్య, యోగా మాస్టర్ ట్రైనర్లు నాగమల్లేశ్వరరావు, బి.చంద్రశేఖర్, కృష్ణ తదితరులు వివిధ యోగాసనాలను వివరించారు. యోగాసనాలతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. కరపలో శుక్రవారం నిర్వహించిన యోగా శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల స్థాయిలో యోగాపై నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏఓ బీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.